ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -70 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 29 జూన్ 2026

# పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

- స్మార్ట్ కిచెన్లపై జగన్ ఆరోపణలను ఖండించిన మంత్రి లోకేశ్
- ఉన్నవారి ఉపాధికి ఢోకా లేకుండానే అదనపు ఉద్యోగాలు కల్పిస్తున్నామని వెల్లడి
- కుక్-కమ్-హెల్పర్ల వేతన బకాయిల ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని వివరణ
- పేదల సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శ



**అమరావతి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల వ్యవహారంపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఎవరి ఉపాధి పోదని, పైగా కొత్త ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు.
ఉపాధి కల్పనపై మాట్లాడుతూ.. "వైఎస్సార్ కడప జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఐదు స్మార్ట్ కిచెన్లు ప్రారంభించాం. వాటి పరిధిలోని 233 మంది కుక్-కమ్-హెల్పర్లు యథావిధిగా తమ విధుల్లో కొనసాగుతున్నారు. త్వరలో జిల్లాలో ఏర్పాటు చేయబోయే మిగతా2లో...

# ఉమ్మడి కుటుంబాలు మళ్లీ రావాలి!



## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సీఎం

- అదే సమాజానికి, వ్యక్తులకు ఎంతో బలం
- నాడు పిల్లలను విలువలతో పెంచడంలో
- నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలది కీలక పాత్ర
- పిల్లల పెంపకంలో తండ్రులకూ బాధ్యత
- సంతానం అంటే 'సంపద' అనే పరిస్థితి
- ఎంత మంది పిల్లలను కన్నా ప్రోత్సహిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**అమరావతి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)**
ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, అలాంటి వ్యవస్థ మళ్లీ రావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. జాతీయ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా ఆదివారం గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. మిగతా2లో...



# ఎస్ఎల్ బీసీ - డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

## - మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం

- నల్లగొండలో 'ప్రజా పాలన- ప్రగతి పాలన' సభలో సీఎం రేవంత్ రెడ్డి
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం..బీఆర్ఎస్, బీజేపీకి బహిరంగ సవాల్
- రూ.1,306 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపనకనగల్ మండలంలో పైలాన్ ఆవిష్కరణ



**నల్లగొండ,జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** 'నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్బీసీ-డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. మూసీ ప్రక్షాళనే నా జీవిత లక్ష్యం. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తున్నాం' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో రూ.1,306 కోట్ల వ్యయంతో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో చేపట్టనున్న ఆర్అండ్బీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ సమీపంలో మిగతా2లో...

# ప్రజల సహకారం దేశ ఐక్యతకు నిదర్శనం

- బంగారం కొనుగోళ్లు తగ్గించినందుకు ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిగికట్టుగా ఎదుర్కొంటున్నాం
- భద్రత స్వయం సమృద్ధి దిశగా భారత్:'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,జూన్ 28(రిపబ్లిక్ న్యూస్) :** పశ్చిమాసియా సంక్షభంతో ఎదురైన ఉద్రిక్త పరిస్థితుల సమయంలో తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన దక్కిందని ప్రధాని మోడీ అన్నారు. ఒక ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను, విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలని తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఆచరణలో పెట్టిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే భారత్ సాధించిన పలు కీలక విజయాలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటున్నట్టు ప్రధాని మోడీ తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల సమయంలో తాను చేసిన పలు సూచనలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. తన పిలుపులకు కేవలం మద్దతు ఇవ్వడమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ప్రజలను బంగారం కొనుగోళు తగ్గించాలని, ఇంధన మిగతా2లో...

# హెలికాప్టర్ కూలి 14 మంది దుర్మరణం



**హైదరాబాద్,జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** సౌదీ అరేబియాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. దేశంలోని ప్రముఖ తీరప్రాంత పారిశ్రామిక నగరం 'రాస్ తానూరా' సమీపంలో జరిగిన ఘోర హెలికాప్టర్ ప్రమాదంలో 14 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రమాదానికి గురైన సదరు మిగతా2లో...

# తెలంగాణలోనూ వస్తాం

- పార్టీ కార్యాలయాలు.. భవిష్యత్ తరాల కేంద్రాలు: బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్
- శంషాబాద్‌లో బీజేపీ జిల్లా రూరల్ కార్యాలయం ప్రారంభం
- మరో ఎనిమిది జిల్లాల్లో వర్చువల్‌గా ప్రారంభం



**శంషాబాద్, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన పద్ధతిలోనే తెలంగాణలో కూడా వస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్మించిన రంగారెడ్డి జిల్లా రూరల్ బీజేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. దీంతోపాటు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట్, మెదక్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో పార్టీ జిల్లా కార్యాలయాలను శంషాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాలూ బీజేపీ మయం అయ్యాయని తెలిపారు. పార్టీ కార్యాలయాలు అంటే ఇటుక గోడలు కాదని, అది పార్టీకి ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండి అభివృద్ధిలో కీలకంగా మారాలని సూచించారు. పార్టీ కార్యాలయాలు అంటే భవిష్యత్ తరాల కేంద్రాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అధికారంలోకి మిగతా2లో...



# తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

# ఎస్ఎల్ బీసీ - డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నల్లగొండ--దేవరకొండ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన హ్యామ్ రోడ్డు ప్రాజెక్టు పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6092.37 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నల్లగొండ పట్టణంలో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. తర్వాత నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతిపాలన' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళనను తన జీవిత లక్ష్యంగా తీసుకొని అమలు చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ భవిష్యత్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో నల్లగొండ జిల్లా త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. తొలి ఉద్యమంలో మంత్రి పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీ, మలి ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ నిరాహార దీక్ష చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య తదితర అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

**ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సిద్ధం** కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన, బీజేపీ కేంద్ర పాలన, కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలన, ఎన్నికల హామీల అమలుపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్, బీజేపీకి సవాల్ విసిరారు. గత ప్రభుత్వాలు ఇవ్వని లక్షలాది కొత్త రేషన్ కార్డులను తమ ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. సంవత్సరానికి రూ.16 వేల కోట్ల వ్యయంతో 3.28 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, ఒక్కో లబ్దిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు పేద కుటుంబాలకు మేలు చేస్తున్నాయని అన్నారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. రూ.69 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పుల్లోకి నెట్టారన్నారు. కట్టిన మూడు సంవత్సరాల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడం గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యమ త్యాగాల పేరుతో కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు, అందుకే ప్రజలు వారిని తిరస్కరించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు.

**రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు** రైతు రుణమాఫీ, రైతు భరోసా, పెట్టుబడి సాయం, బోనస్, వరి కొనుగోళ్లతో రైతులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 30 నెలల్లో రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. దేశంలో అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవగా, అందులో నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ గురుకులాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని అన్నారు.

**మూసీ ప్రక్షాళనే తమ జీవిత లక్ష్యం** మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారని, అందుకే దాన్ని శుద్ధి చేసేందుకే తమ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలకు మేలు చేసే ఇలాంటి పథకాలను అడ్డుకోవడం కొన్ని పార్టీలకు అలవాటుగా మారిందని, ఎవరు అడ్డు వచ్చినా మూసీ ప్రక్ష?ళన ఆగదని స్పష్టంచేశారు. ఎస్సీ ఉపవర్గాల వర్గీకరణ, కులగణన వంటి చారిత్రక నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. బలహీన వర్గాలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటనలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కనగల్లు మండల మహిళా సర్పంచులకు ఎంట్రీ పాసులు మంజూరు కాక నిరాశతో వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజ్మీరా లక్ష్మణ్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండ మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, బాలు నాయక్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, కోటిరెడ్డి, మదర్‌డెయిరీ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెలికాప్టర్ కూలి 14 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

హెలికాప్టర్.. ప్రపంచంలోనే అతిపెద్ద సౌదీ చమురు దిగ్గజ సంస్థ అయిన 'సౌదీ అరామ్కో' కు చెందినదిగా అధికారిక వర్గాలు ధృవీకరించాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# తెలంగాణలోనూ వస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రావడానికి పార్టీ కార్యకర్తలు, శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశ్రాంతి విరామం లేకుండా రానున్న రోజుల్లో భోగాలను పక్కనపెట్టి త్యాగాలు చేసి పార్టీని అధికారంలో తీసుకురావడానికి రాష్ట్ర కమిటీ కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, రంగారెడ్డి జిల్లా రూరల్ పార్టీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, బొక్క నరసింహారెడ్డి, చింతల నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విస్తారంగా వర్షం



**హైదరాబాద్,జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు 450 రెయిన్‌గేజ్ సెంటర్ల పరిధిలో వర్షపాతం నమోదైంది. ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, ములుగు, జనగామ జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల భారీ వర్షం నమోదైంది. సోమవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, నిర్మల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో, మంగళవారం ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, బుధవారం నాడు మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం పడే సూచనలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశముంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయి. టీజీడీపీఎస్ నివేదిక ప్రకారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు రావినూతల(ఖమ్మం) 8 సెంటీమీటర్లు, జానకంపేట(నిజామాబాద్) 7.8 సెంటీమీటర్లు, మాల్యాల్(జగిత్యాల) 7.78 సెంటీమీటర్లు, తాటికొండ(జనగాం) 7.6 సెంటీమీటర్లు, మోస్ర(నిజామాబాద్) 7.45 సెంటీమీటర్లు, సిరికొండ(నిజామాబాద్) 7.43 సెంటీమీటర్లు, తూంపల్లి(నిజామాబాద్) 7.33 సెంటీమీటర్లు

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**న్యూఢిల్లీజూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** వైద్య ప్రవేశ పరీక్ష నీట్‌తో సహా పరీక్షా విధానంలో జరిగిన అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జంతర్‌మం తర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష?ను ప్రారంభించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జూన్ 20 నుంచి ఆందోళన ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ఆందోళన ఆదివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. తొలుత వాంగ్‌చుక్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సీజేపీ ప్రతినిధులు రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అనంతరం జంతర్ మంతర్ వద్దకు చేరుకుని రెండు నిమిషాల మౌనం పాటించిన అనంతరం సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను ప్రారంభించారు. ఆయన దీక్ష?కు మద్దతుగావందలాది మంది యువకులు, విద్యార్థులు జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. పలువురు రైతు నాయకులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం సీజేపీ వ్యవస్థాపకులు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ నిరాహార దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్ కు మద్దతు తెలిపేందుకు వస్తున్న ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్‌లకు చెందిన పలువురు రైతు నాయకులను జంతర్ మంతర్ చేరుకోకుండా నిరోధించేందుకు గృహ నిర్బంధంలో ఉంచుతున్నారని ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదం మరువకముందే తాజాగా టెట్ పరీక్ష? పేపర్ లీక్ కారణంగా మహారాష్ట్ర టెట్ పరీక్షను రద్దు చేశారని, ఈ అవకతవకలపై జవాబుదారీతనం కోసం జరుగుతున్న నిరసనలో పాల్గొని మద్దతు తెలపాలని రైతులకు, విద్యార్థులకు, సంఘాలకు దీప్కే విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య కేవలం ఒక పరీక్షకు మాత్రమే పరిమితం కాదని, విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వాసంపై ఉన్న విస్తృత ఆందోళనలను ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. దేశ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల విశ్వాసంపై తమకున్న తీవ్ర ఆందోళనలను తెలియజేయడమే తమ నిరసన లక్ష్యమని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించిన కొద్దిసేపటికే జంతర్ మంతర్ వద్ద ఢిల్లీ పోలీసులు నీటి, పారిశుద్ధ్య సౌకర్యాలను నిలిపివేశారని అభిజీత్ ఆరోపించారు. ఈ విషయంపై ?అధికారులకు పదేపదే విజ్ఞప్తి చేసినా నిరసన ప్రదేశంలో ప్రాథమిక సౌకర్యాలను నిలిపివేశారని ఆయన పేర్కొన్నారు.

# పేద పిల్లలకు మంచి భోజనం పెడుతుంటే ఏడుపా?..

(మొదటి పేజీ తరువాయి)

మరో 33 స్మార్ట్ కిచెన్ల వల్ల కూడా ఏ ఒక్కరి ఉపాధికీ నష్టం వాటిల్లదు. పైగా, ఈ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలకు అదనంగా 38 మంది హెడ్ కుక్స్, 22 మంది అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, సుమారు 76 మంది డ్రైవర్లకు ఉపాధి లభించబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి అదనపు ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారు? పేదలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదా?" అని లోకేశ్ ప్రశ్నించారు.

వేతనాల బకాయిల ఆరోపణలను కూడా లోకేశ్ తోసిపుచ్చారు. "కడప జిల్లాలోని 3,450 మంది కుక్-కమ్-హెల్పర్లకు 2026 ఏప్రిల్ నెల వరకు జీతాలు పూర్తిగా చెల్లించాం. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గౌరవ వేతనం చెల్లింపు ఉండదు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదు. మరి జగన్ ఎవరి బకాయిల గురించి ఫేక్ ఆరోపణలు చేశారో చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుతో విద్యార్థులకు మరింత పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. "పేద పిల్లలకు మంచి భోజనం అందించడాన్ని, వారి ఆరోగ్యాన్ని కూడా సహించలేకపోతే ఎలా జగన్ గారు?" అంటూ మంత్రి లోకేశ్ చురకలంటించారు.

# సుప్రీం కొలీజియంలో హైదరాబాదీ సీనియర్ న్యాయమూర్తి



**న్యూఢిల్లీ,జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** సుప్రీంకోర్టు కొలీజియంలో న్యాయమూర్తి పిఎస్ నరసింహ సభ్యులు కానున్నారు. ఆదివారం జస్టిస్ జెకె మహేశ్వరి రిటైర్మెంట్‌తో కొలీజియంలో సభ్యులుగా సుప్రీంకోర్టులో ఐదవ సీనియర్ న్యాయమూర్తి నరసింహకు అవకాశం దక్కింది. ఈ బాధ్యతల్లో ఆయన 2028 మే 2వ తేదీ వరకూ ఉంటారని సుప్రీంకోర్టు అధికారిక కార్యాలయ వర్గాలు ఆదివారం తమ ప్రకటనలో తెలిపాయి. ఇప్పటి మార్పుల తరువాత కొలీజియంలో ఇకపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎంఎం సుంద్రేష్‌తో పాటు జస్టిస్ పిఎస్ నరసింహ కూడా తాజాగా చేరుతారు. కొలీజియంలో సభ్యుడు అయ్యే న్యాయమూర్తి నరసింహ 1963 మే మూడున హైదరాబాద్‌లో జన్మించారు. విద్యాభ్యాసం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది, నిజాం కాలేజీ విద్యార్థి అయిన నరసింహ ఢిల్లీ యూనివర్శిటీలో 1988లో క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు.

# ఉమ్మడి కుటుంబాలు మళ్లీ రావాలి!

(మొదటి పేజీ తరువాయి) అనంతరం చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. పిల్లలను ఎత్తుకుని ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులతో ముఖ్యమంత్రి మాట్లాడి వారి వివరాలు అడిగారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళ్తున్న మహిళలు పిల్లల పెంపకంలో ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో భర్త, పురుషులు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని చెప్పారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో పెద్దవాళ్లు భాగస్వాములు అయ్యేవారని అన్నారు.




పిల్లలను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. సంతానాన్ని సమస్యగా, భారంగా చూసే విధానం పోవాలని, సంతానం అంటే సంపద అనే పరిస్థితి వస్తోందని అన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో ముందుగా తల్లిదండ్రులకు అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి కుటుంబాలే సమాజానికి, వ్యక్తులకు కూడా ఎంతో బలాన్ని ఇస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను ఆరోగ్యశాఖ అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు వయసున్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కమిషనర్ చక్రధర్‌బాబుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తోతాపురి మామిడి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)**



ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, కేంద్రం అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల మార్కెట్ పరిస్థితుల కారణంగా మామిడి గుజ్జు (పల్ప్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయని చంద్రబాబు తన లేఖలో వివరించారు. దీని ప్రత్యక్ష ప్రభావంతో స్థానిక మార్కెట్లలో తోతాపురి మామిడి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయని, దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సుమారు 7.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుంచి సేకరించేందుకు రూ. 281 కోట్లు ఆర్థిక సహాయంగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు, మార్కెట్ ధరకు, గిట్టుబాటు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేసేలా ప్రత్యేకంగా 'ధరల వ్యత్యాస చెల్లింపు పథకం' అమలు చేయాలని సూచించారు.

# చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణ



**అనంతపురం/గుత్తి, జూన్ 28: (రిపబ్లిక్ న్యూస్)**
రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం గుత్తి ఆర్ అండ్ బి అతిథి గృహంలో రైతు సంఘం ఆధ్వర్యంలో 'చలో విజయవాడ' కరపత్రాలను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరభద్రస్వామి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రమేష్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్రాముడు, కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ మాట్లాడారు.
డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, పెట్రోల్, డీజిల్, వ్యవసాయ యంత్ర పరికరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.
కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పంట రుణాల వడ్డీ సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రాగులపాడు తూము నిర్మాణం, చెరువుల అభివృద్ధి, గుత్తి తాగునీటి సమస్య పరిష్కారం కోసం పెనకచర్ల పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ నెల 30న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరసింహస్వామి, నాయకులు ఆర్.ఎస్. భాషా, డేనియల్, మహిళా సమైక్య నియోజకవర్గ కార్యదర్శి మహముదా, అమీదా, నాగలక్ష్మి, మధుమతి, రామలక్ష్మి, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత తరాన్ని నిర్మిద్దాం

**- తెలుగుదేశం పార్టీ నేత కప్పట్రాళ్ల మల్లికార్జున**



**దేవనకొండ జూన్ 28(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**మండలం పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామ సచివాలయం నందు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెదేపా నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల మల్లికార్జున మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన బాలలే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సందు పాలెం లాలప్ప, పెద్ద కౌలుట్లయ్య, కౌలుట్ల,సుంకన్న, రవికుమార్, రాముడు, గిడ్డయ్య, వైద్య సిబ్బంది, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సరస్వతి,ఆశా కార్యకర్త తిమ్మక్క, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీదేవి, వేరేశమ్మ గ్రామ సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజం కోసం అందరం కృషి చేద్దాం

**-కాకర్ల శాంతి కుమార్**





**దేవనకొండ జూన్ 28(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలియో డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా, ఈరోజు దేవనకొండ మండల కేంద్రంలో ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.పుట్టిన ప్రతి బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయస్సు వరకు పోలియో చుక్కలు మరియు ప్రభుత్వం సూచించిన అన్ని టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ఇది ప్రతి తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మనందరి బాధ్యత.పిల్లల ఆరోగ్యమే భావితరాల భవిష్యత్తు.ఈ రోజు మనం తీసుకునే చిన్న జాగ్రత్తే రేపటి వారిఆరోగ్యకరమైన జీవితానికి బలమైన పునాది."ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు పోలియో రహిత భారతం" అనే లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి కుటుంబం భాగస్వామి కావాలి.మన చిన్నారులను కాపాడుదాం పోలియోను శాశ్వతంగా తరిమికొడదాం!

# చిన్నారులకు పోలియో చుక్కలు





**అనంతపురం/గుత్తి,జూన్ 28: (రిపబ్లిక్ న్యూస్)**
పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుత్తి పట్టణంలోని పాత మునిసిపల్ కార్యాలయంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ జబ్బార్ మియా ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా కమిషనర్ జబ్బార్ మియా మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. పట్టణంలోని ప్రతి తల్లిదండ్రులు 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, భవిష్యత్తులో పోలియో వ్యాధి బారిన పడకుండా కాపాడాలని సూచించారు.

**పల్స్ పోలియో రెండు చుక్కలు వేయాలి**
తొండపాడు,కొత్తపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి అనంతరం ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామంలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ రాంబాబు, డాక్టర్ ఎల్లప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, టీడీపీ నాయకుడు రామకృష్ణ, మునిసిపల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి దిశానిర్దేశం చేసిన మహానేత అపర చాణక్యుడు పీవీ నరసింహారావు: డీవీ సాంబశివుడు

**106వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘన నివాళులు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**
భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు అజాతశత్రువు, అపర చాణక్యుడు, దేశ ఆర్థిక సంస్కరణలకు బీజం వేసిన దూరదృష్టి గల నాయకుడని కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు పేర్కొన్నారు.
పీవీ నరసింహారావు 106వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహానుభావుల్లో పీవీ ఒకరని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో భూసంస్కరణల చట్టాన్ని అమలు చేసి, భూమిలేని పేదలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. స్వయంగా తన కుటుంబానికి చెందిన భూములను కూడా పేదలకు పంచడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు.కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పీవీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వన్యప్రాణి సంరక్షణకు చట్టాలు తీసుకొచ్చారని చెప్పారు. అనంతరం ప్రధానిగా దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుంచి గట్టెక్కించి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. నంద్యాల నుంచి ఎంపీగా ఎన్నికై ప్రధానిగా సేవలందించిన ఏకైక తెలుగు నాయకుడిగా పీవీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.అంతకుముందు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాశ్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్, కర్నూలు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ బి. ఆతిఫ్ అలీ ఖాన్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బి. సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, రంగస్వామి, మనోజ్, హరి, వెంకటేష్, ఎల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి సేవలో న్యాయమూర్తులు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 28 రిపబ్లిక్ న్యూస్**
ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానమునకు నలుగురు న్యాయమూర్తులు వచ్చి దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు మహేశ్వర రావ్ శేఖర్ చిత్తూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జయసూర్య జిల్లా జడ్జి అరుణ సారిక అమ్మవారి దర్శనార్థము విచ్చేసినారు. ఈ కార్యక్రమములో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఏకాంబరం అమ్మవారి దర్శనము కల్పించి తీర్థ ప్రసాదములు అందజేసినారు.

# నిండు జీవితానికి రెండే చుక్కలు:మోనా




**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 28 రిపబ్లిక్ న్యూస్**
పల్స్ పోలియో విజయవంతంగా ముగిసిందని మండల వైద్యాధికారిని మోనా తెలిపారు.ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు వివరించారు. ఐదు మార్గాల గుండా 50 కేంద్రాలను ఏర్పాటు చేసి 4859 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపట్టామని దాదాపు 90 శాతం పూర్తయింది అన్నారు. తక్కిన వారికి ఆరోగ్య సిబ్బంది వారి ఇళ్ల వద్దకు వెళ్లి చుక్కలు వేస్తున్నట్లు వివరించారు.ప్రధాన కూడళ్లు బోయకొండ పరిసర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాట్లు చెసినట్లు వివరించారు.ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అలారుదిన్నెలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం

**05 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న:- టీడీపీ సీనియర్ నాయకులు మల్లయ్య**



**దేవనకొండ , జూన్ 28 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
అలారుదిన్నె పాఠశాల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలియో నివారణ చుక్కలను ఆరోగ్య సిబ్బంది మరియు టిడిపి సీనియర్ నాయకులు మల్లయ్య గారి చేతుల మీదుగా ప్రారంభించారు .చిన్నారులు పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వారు సూచించారు. కార్యక్రమానికి వచ్చిన చిన్నారులకు నిర్ణీత ప్రమాణాల ప్రకారం పోలియో చుక్కలు వేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 05 సంవత్సరాల వయస్సు గల ఏ చిన్నారినీ పోలియో చుక్కలకు దూరం చేయరాదని ఆరోగ్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల సహకారంతో అలరుధిన్నెలో పల్స్ పోలియో కార్యక్రమం సజావుగా ముగిసింది.

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

## రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లలో ప్రత్యేక పోలియో బూత్‌లు -నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**
పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిత్తారి వీధిలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ను సందర్శించిన కమిషనర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఐదేళ్లలోపు ఉన్న 82,964 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 229 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో సుమారు 2,300 మంది సిబ్బంది ఈ





కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ వంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు సోమవారం ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని పేర్కొన్నారు. ఎవరైనా చిన్నారులు మిగిలిపోతే సమీపంలోని పోలియో బూత్‌ను సంప్రదించి తప్పనిసరిగా చుక్కలు వేయించుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, మెడికల్ ఆఫీసర్ భార్గవ్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి: ఎంపీ బస్తిపాటి నాగరాజు

## పంచలింగాల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసిన ఎంపీ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**
రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు



వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయించేలా అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నోటికి వచ్చినట్లు మాట్లాడడం జేసి నైజం

## వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం

**అనంతపురం ప్రతినిధి, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):**
టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని వైయస్సార్సిపి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మండిపడ్డారు. ఆయన టిడిపి నాయకులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తుండడంతో తాడిపత్రిలో రాజకీయ దుమారం లేవడంతో అగ్గి రాసుకుంది. దీంతో వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడుల చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వైయస్సార్సిపి పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఉదయం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

### 25 మందికిపైగా దాడులు జరిగినా ఫిర్యాదులు స్వీకరించలేదు

ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అధికార పార్టీ నేతల ఒత్తిడితో పోలీసులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గాంధీ విగ్రహం వద్ద శాంతియుత ధర్నాకు అనుమతి నిరాకరించడంతో మూడు రోజుల క్రితం తన ఇంటి వద్దే నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట కూడా ఆందోళన వ్యక్తం చేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీలు తనకు సంఘీభావం తెలిపారని, అయితే తనకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్యపై జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే మాటలతో జిల్లాలో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తాడిపత్రిలో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి




వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ప్రోత్సహిస్తున్నారని, దాడులు చేసిన వారిపైన కాకుండా బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని పెద్దారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 25 మందికిపైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరిగినా చాలా ఫిర్యాదులను పోలీసులు స్వీకరించలేదని, తప్పుడు కేసులతో వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు.

### గంజాయి విక్రయాల పై పోలీసులు చర్యలు తీసుకుంటారా

జేసీ ప్రభాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ సమీపంలో ధర్నా చేసి బహిరంగంగా నిరసన వ్యక్తం చేసినా ఎలాంటి కేసులు నమోదు కాలేదని, అదే వైఎస్సార్‌సీపీ శాంతియుత నిరసనలకు మాత్రం కేసులు పెడుతున్నారని విమర్శించారు. తాడిపత్రిలో అధికార పార్టీకి చట్టం ఒకలా, ప్రతిపక్ష పార్టీకి మరోలా చట్టాన్ని పోలీసులు అమలు చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగా తాడిపత్రి పోలీసులపై కూడా పెద్దారెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కొంతమంది పోలీసులు సివిల్ డ్రెస్సులో అధికార పార్టీ నేతల వెంట తిరుగుతున్నారని, వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వాలా వద్దా అన్నది కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకే జరుగుతోందని ఆరోపించారు. దీంతో పోలీసులు ప్రజలకు కాకుండా రాజకీయ నాయకులకు విధేయులుగా మారారనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిందన్నారు. తాడిపత్రి గంజాయి, మట్కా, జూదం వంటి అక్రమాలకు కేంద్రంగా మారిందని, అధికారులకు వాటిపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గంజాయి విక్రయాలు ఎక్కడ జరుగుతున్నాయో తాను చూపిస్తానని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలను వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్నారని, గ్రామాల్లో సైతం కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదని సూచించారు. రాజకీయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని, దాడులు, ప్రతిదాడుల సంస్కృతిని విడిచిపెట్టాలని హితవు పలికారు. తాను విలువలతో కూడిన రాజకీయాలనే నమ్ముతానని, దాడులు చేసే వ్యక్తిని కాదని పెద్దారెడ్డి స్పష్టం చేశారు.

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్..

## నేరాలకు స్వస్తి పలకాలని కర్నూలు పోలీసుల హెచ్చరిక

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచన

### మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం





**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ కర్నూలు పోలీసులు రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే, భవిష్యత్తులో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఏపీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

**దేవనకొండ, జూన్28(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొన్నారు.
స్థానిక పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించిన ఆమె 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికీ చేరుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనతో ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. తల్లిదండ్రులు అపోహలు నమ్మకుండా పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారికి రెండు



చుక్కలతో జీవితాంతం రక్షణ కల్పించవచ్చని వివరించారు. కేంద్రానికి వచ్చిన చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఆశీర్వదిస్తూ ఆరోగ్యంగా ఎదగాలని ఆకాంక్షించారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎం లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.
కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించబడింది. ప్రజల నుంచి కూడా మంచి స్పందన లభించింది. పోలియో నిర్మూలన లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలకు



ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కప్పట్రాళ్ల బొజ్జమ్మ కోరారు. చిన్నారుల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అని ఆమె పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలను కప్పట్రాళ్ల బొజ్జమ్మ అభినందించారు.

# కె వడ్డీ పల్లెలో ఘనంగా సీతాలమ్మ ఉత్సవం.





**రైల్వే కోడూరు జూన్ 28 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి పంచాయతీ జిల్లెలు మడక రెవిన్యూ గ్రామం కె వడ్డిపల్లి గ్రామంలో సీతాలమ్మ గ్రామ దేవత ఉత్సవం ఆదివారం అత్యంత వైభవంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, గ్రామస్తులు గ్రామ దేవతను గ్రామానికి నాలుగు దిక్కుల పూజలు చేసి వారి ముక్కుబడులను శీతలమ్మకు తీర్చుకున్నారు, గ్రామదేవత గురించి గ్రామ పెద్దలు ఆలయ కమిటీ భక్తులు శీతలమ్మ గురించి తెలియజేశారు సీతాలమను భక్తిశ్రద్ధలతో కొలిస్తే ఆమె భక్తులను అనుగ్రహిస్తుందని భక్తుల పాలిట కొంగు బంగారం గా మా సీతాలమ్మ మమ్మలను కాపాడుకుంటూ వస్తుందని గ్రామస్తులు తెలియజేశారు ప్రతి సంవత్సరము శీతల మహోత్సవం గ్రామస్తులందరం ఐకమత్యంతో సంతోషంగా భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామని గ్రామస్తులు తెలియజేశారు, ఈ ఉత్సవానికి గ్రామంలోని పిల్లలు పెద్దలు వృద్ధులు అందరూ పాల్గొని ఐక్యమత్యంతో పూజలు నిర్వహించి గ్రామ భక్తుల కోరికలు తీర్చుకోవడంలో గ్రామదేవత సీతాలమ్మ మమ్మల్ని అనుగ్రహిస్తుందని తెలియజేశారు.

# బి ఎల్ ఏ ల తో కలిసి ఏన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ చేసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.



**రైల్వే కోడూరు జూన్ 28 రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారి పల్లి మండలం లో సర్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మంగంపేట ఆర్ ఆర్ 2బూత్ 153 పరిధి లో బిఎల్ఓ వెంకటరమణ, బి ఎల్ ఎ, వైయస్సార్సీపీ యూత్ వింగ్ ప్రెసిడెంట్ అందే



వెంకటేష్, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఓరుగంటి అనిల్ స్వామి అద్వర్యం లో ఏనుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో శ్రీనివాసులు,చంటి, భార్గవి,శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు

# ఘనంగా మొహరం వేడుకలు

## మాల్యవంతంలో భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

**శ్రీ సత్య సాయి ప్రతినిధి, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):**
మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలో శనివారం రాత్రి పానకాల మొహరం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం పీర్ల ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మొహరం సందర్భంగా వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన పీర్లను గ్రామ వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామస్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



మాల్యవంతం కురబ యువత వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం సంప్రదాయ ప్రకారం పీర్ల భేటీ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం పీర్లు జల్దీకి బయలుదేరాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకలలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888
సోమవారం 29 జూన్ 2026

# ఓర్వకల్లు రాక్ గార్డెన్ లో విజయ్ దేవరకొండ రణబలి సినిమా చిత్రీకరణ

## దర్శకుని మర్యాదపూర్వకంగా కలిసిన బి శివశంకర్






**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో రాక్ గార్డెన్స్ లో విజయ దేవరకొండ రణబలి చిత్రంసినిమా,రాయలసీమ చారిత్రక నేపథ్యంలో రూపొందుతున్న 'రణబలి' చిత్రం 1878 ప్రాంతంలో జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చారిత్రాత్మక యాక్షన్ ఫాంటసీ అని దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ తెలిపారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రలు పోషిస్తున్నారని చెప్పారు. ఓర్వకల్లుతో పాటు రాయలసీమలోని పలు చారిత్రక ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోందని, సహకరించిన మీడియా మరియు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో గొప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తామని ఆయన పేర్కొన్నారు. దర్శకుని మర్యాదపూర్వం కలిసిన బి శివశంకర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మీరు సినిమా తీయడం చాలా సంతోషం కరమైనదని వారు మాట్లాడుతూ జరిగింది ఇలాంటి సినిమాలు ఇంకెన్నో తీసి విజయాలని సాధించాలని సాధించాలని చెప్పడం జరిగిందిద

# చౌడేపల్లి సర్కిల్ లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

## - 20 నిమిషాల పాటు ట్రాఫిక్ లో ఆగిపోయిన అంబులెన్స్




**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 28రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి లోని మూడు రోడ్ల కూడలిలో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతం నిత్యం వాహనాలు, జనసంచారంతో రద్దీగా ఉంటుంది. అత్యవసర పరిస్థితిలో సర్కిల్లో నుంచి ఆసుపత్రికి అంబులెన్స్ రావడానికి కూడా సుమారు 20 నిమిషాలు సమయం పడుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే రహదారిపై ఆక్రమణలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది.రద్దీ సమయాల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు వాహనాలు బస్టాండ్‌లోకి వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రయాణ సమయం పెరుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుపై ముఖ్యంగా బోయకొండ బస్సు సర్కిల్ లోనే ఆగడం, అక్రమ పార్కింగ్‌లు, ఇరుకైన మార్గం, రహదారిపై వ్యాపార కార్యకలాపాలు వంటి కారణాలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలు అని అంటున్నారు. ప్రతి ఆర్టీసీ బస్సు ఆర్టీసీ బస్టాండ్ లోకి వెళ్లి వచ్చేలా ఉంటే ట్రాఫిక్ సమస్య కొద్దిపాటైన తగ్గుతుందని స్థానికులు అంటున్నారు.

# కర్నూలు స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా ఏఆర్ మెట్రో షూస్ ప్రారంభం




**కర్నూలు ప్రతినిధి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)**
ఆదివారం ఏ ఆర్ మెట్రో షూ షాప్ నందు పేరెన్నిక గల బూట్లు, పాదరక్షలపై 10 శాతం, సాధారణ కంపెనీలకు సంబంధించిన వాటిపై 20 శాతంతగ్గింపు ఇవ్వడం జరుగుతుందని షోరూం నిర్వాహకులు షేక్ ఫయాజుల్ రెహమాన్ చెప్పారు.స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా ూ= మెట్రో షూస్ నూతన షోరూం ప్రారంభించి అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే పాత బస్టాండ్ నందు బాటా షూ, అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ నందు వుడ్ ల్యాండ్ షోరూం, కొత్త బస్టాండు సమీపంలో పాపులర్ షూ కంపెనీ ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండ్రి అతావూరు రహమాన్ నాలుగు దశాబ్దాల క్రితం స్థాపించిన తమ షో రూమ్ లతో పాటు కస్టమర్ల కోరిక మేరకు ఈ షోరూం ప్రారంభించినట్లు చెప్పారు. చిన్నపిల్లల మొదలు పెద్దల వరకు అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన బూట్లు, పాదరక్షలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గతంలో ఆదరించిన మాదిరిగానే ఈ షో రూమ్ నందు కూడా అందుబాటులో ఉన్న నగర ప్రజలు సందర్శించి ఇష్టమైన వాటిని కొనుగోలు చేసి తమ వ్యాపార అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు ప్రతి వస్తువుపై డిస్కౌంట్ ఉంటుంది అని చెప్పడం జరిగింది

# హత్నూరలో ముమ్మరంగా పల్స్ పోలియో

## చిన్న పిల్లలకు చుక్కలు వేసిన సర్పంచ్ నల్లొల్ల ఎల్లయ్య



**సంగారెడ్డి జిల్లా(ప్రతినిధి): రిపబ్లిక్ న్యూస్ జూన్ 28**
హత్నూర .మండల పరిధిలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత విజయవంతంగా సాగింది. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నల్లొల్ల ఎల్లయ్య గారు ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్లొల్ల ఎల్లయ్య గారు పోలియో కేంద్రాలను సందర్శించి, స్వయంగా చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో మరియు దేశాన్ని పోలియో రహితంగా ఉంచడంలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమైనదని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. అప్పుడే రాబోయే తరాలను ఈ మహమ్మారి బారి నుండి కాపాడుకోగలమని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి బిడ్డకు ఈ చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న కృషిని సర్పంచ్ గారు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామ. నాయకులు బోర పట్ల.కిష్టయ్య మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ మహోత్సవం

**సంస్థ అభివృద్ధికి వారి సేవలు చిరస్మరణీయం : వక్తలు**




**అనంతపురం సంక్షేమం, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఏడీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో డీజీఎం సుఖ్‌దేవ్ బాబు, మేనేజర్ జానకి రామిరెడ్డిల ఉద్యోగ విరమణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీసీబీఈఏ) అనంతపురం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగాబ్యాంకింగ్, సహకార రంగ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ అధ్యక్షుడు నెట్టం వెంకటేష్, టీడీపీ నాయకుడు ఆలం నరసా నాయుడు, ఏడీసీసీబీ సీఈఓ విజయ్ కుమార్, ఏపీసీసీబీఈఏ చైర్మన్ బాలాజీ ప్రసాద్, నాబార్డ్ డీడీఎం అనురాధ, డీఆర్ ఓఎస్‌డీ నాగరాజు, శ్రీ సత్యసాయి జిల్లా డీఎల్‌సీఓ ఆదినారాయణ, రిటైర్డ్ డీసీఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన అధికారులు బ్యాంకు అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేస్తూ ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొన్నారని ప్రశంసించారు.అనంతరం ఏడీసీసీబీ పాలకవర్గం, ఉద్యోగ సంఘం ప్రతినిధులు, తోటి ఉద్యోగులు సుఖ్‌దేవ్ బాబు, జానకి రామిరెడ్డిలను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపికలను అందజేసి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏడీసీసీబీ డీజీఎంలు విజయ్ చంద్రారెడ్డి, ఎ.బి. రామ్ ప్రసాద్, కృష్ణా డీసీసీబీ జనరల్ మేనేజర్ రంగబాబు, కర్నూలు డీసీసీబీ డీజీఎంలు ఉమామహేష్, సునీల్ కుమార్‌తో పాటు ఏపీసీసీబీఈఏ జిల్లా ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్నూలు ఆర్డీవోపై తీవ్ర ఆరోపణలు చేసిన రాయలసీమ యువజన పోరాట సమితి

## విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ - ఆధారాలు త్వరలో బయటపెడతామని వి.వి.నాయుడు వెల్లడి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**
కర్నూలు ఆర్డీవో కె. సందీప్ కుమార్‌పై రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వి.వి. నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారు. విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆర్డీవో ఇటీవల చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.
గార్గేయపురం భూముల వ్యవహారంలో బాధితులే ప్రెస్ నోట్ విడుదల చేశారని, తాను కేవలం మీడియాకు పంపడంలో మాత్రమే సహకరించానని పేర్కొన్నారు. తాను ఆ భూమికి అగ్రిమెంట్ హోల్డర్‌నని, అనంతరం పరిణామాల నేపథ్యంలో తనపై లక్ష్యంగా చేసుకుని చర్యలు చేపట్టారని ఆరోపించారు.
ఆర్డీవో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ద్వారా వ్యవహారాలు నడుస్తున్నాయని, అధికార దుర్వినియోగం జరుగుతోందని ఆరోపించారు. భూ సేకరణ, భూ మార్పిడి (ల్యాండ్ కన్వర్షన్), ఆర్‌ఓఆర్ కేసులు, కోర్టు ఫైళ్ల వ్యవహారాల్లో కూడా అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు.
పంచలింగాల, ఓర్వకల్లు భూ సేకరణకు సంబంధించిన ఫైళ్లలో అక్రమాలు జరిగాయని, ప్రైవేటు వ్యక్తుల ద్వారా దందా కొనసాగుతోందని ఆరోపించారు.
ఈ వ్యవహారాలపై విజిలెన్స్ శాఖతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.తనపై తప్పుడు కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన వి.వి. నాయుడు, చట్టపరంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారి అధికార దుర్వినియోగానికి పాల్పడటం బాధాకరమని విమర్శించారు.
త్వరలో కర్నూలుకు వచ్చిన అనంతరం అన్ని ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను మీడియా ముందుంచుతానని వి.వి. నాయుడు తెలిపారు.గమనిక: ఈ వార్తలో పేర్కొన్న అంశాలు రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు వి.వి. నాయుడు చేసిన ఆరోపణలు మాత్రమే. వీటిపై కర్నూలు ఆర్డీవో స్పందన తెలియాల్సి ఉంది.

# వైభవంగా మొహరం ఉత్సవాలు

**సహకరించిన అందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు**

**అధికారుల సేవలు అభినందనీయం**

**గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకుల సేవలకు ప్రశంసలు**

**ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



**నార్పల, జూన్ 28 (ప్రతినిధి):**
శింగనమల నియోజకవర్గంలోని నార్పల మండలం గూగూడు గ్రామంలో శ్రీ కుళ్లాయిస్వామి.. శ్రీ ఆంజనేయస్వామి జంట దేవాలయాల మొహరం మహోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు పది రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ మహోత్సవాలు లక్షలాది మంది భక్తుల భక్తిశ్రద్ధల మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ఘనంగా ముగియడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారని తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడం వల్ల ప్రతి ఒక్కరూ సౌకర్యవంతంగా దర్శనం చేసుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
మహోత్సవాల నిర్వహణలో సమర్థవంతమైన పర్యవేక్షణ అందించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జగదీష్, దేవాదాయ శాఖ ఈవో సాకేతపురం శోభలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నాయకత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.
రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారని కొనియాడారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర వైద్య సేవల కల్పనలో అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయడం మహోత్సవాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.అలాగే ఆలయ కమిటీ, నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు విశేష సహకారం అందించారని ఎమ్మెల్యే అభినందించారు.
మహోత్సవాల విశిష్టతను ప్రజలకు విస్తృతంగా చేరవేసిన మీడియా ప్రతినిధులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయగలిగామని, అధికార యంత్రాంగం, ఆలయ కమిటీ, గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకులు అందరూ ఒకే లక్ష్యంతో పనిచేయడం వల్లే ఈ మొహరం మహోత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.శ్రీ కుళ్లాయిస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వారి దివ్య ఆశీస్సులు శింగనమల నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సిరిసంపదలు ప్రసాదించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆకాంక్షించారు.

# పేదలు పొట్ట కొట్టే జి రామ్ జి ని రద్దు చేయాలి

## 2005 ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి. సిఐటియు డిమాండ్.




**రైల్వే కోడూరు జూన్ 28 రిపబ్లిక్ న్యూస్.**
గత ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందని దీన్ని రద్దు చేస్తూ ప్రస్తుత భారత జనరల్ పార్టీ ప్రభుత్వం పేరు మార్చి జి రామ్ జి పథకాన్ని ప్రారంభించడం అత్యంత దుర్మార్గమని కామ్రేడ్లో ఎట్టి పరిస్థితుల్లో దీన్ని సహించలేని పేదలను దృష్టిలో పెట్టుకొని కొత్త పథకాన్ని లేకుండా పాత పథకాన్ని కొనసాగించాలని భారతీయ కమ్యూని పార్టీ డిమాండ్ చేస్తున్నది,2005లో ఉపాధి హామీ చట్టం, పని గ్యారంటీని, పథకంగా మార్చి, దీనికి మంగళం పాడే విధంగా, మోడీ తెచ్చిన కొత్త పథకం జి రాంజీ, దీనిని తక్షణం రద్దు చేసి, 2005 మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని, అమలు చేయాలని తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో సిఐటియు ఆఫీసులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటి రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిపిఎం వాపక్షుల పోరాటం ఫలితంగా 2005లో ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో,వలసల నివారణ కోసం కొంతమేర ఆకలి తీర్చింది అన్నారు. దీనితో కూలి రేట్లు పెరిగాయని, స్త్రీ పురుషులకు సమాన వేతనం వచ్చిందని. కానీ ధరలకు అనుగుణంగా 600 కూలి పెంచాలంటే, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పట్టించుకోలేదన్నారు. ప్రజల పన్నులు కడితే పెట్టుబడుదారులకు రెండున్నర కోట్లు రాయితీ ఇస్తున్నారని. 16 లక్షల కోట్లు బకాయిలు రద్దు చేశారన్నారు. చట్టాన్ని తీసేసి, దీన్ని పథకం గా మార్చారు, 125 రోజులు పని కల్పిస్తామని వట్టి మాటలు చెబుతున్నారు. ప్రస్తుతం వంద రోజులు పని చట్టం ఉన్నప్పుడే 50 రోజుల కంటే ఎక్కువ కల్పించలేదన్నారు, 125 రోజులు పని కల్పించాలంటే ఏడు కేటాయించిన బడ్జెట్ కు అదనంగా వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. 125 రోజులు పని అయినా కల్పించాలి. లేదా 125 రోజులు కూలి డబ్బులు అకౌంట్లో వేయాలి అని డిమాండ్ చేశారు. పాత పథకం 90 శాతం కేంద్రం నిధులు కేటాయిస్తే, రాష్ట్రం 10% కేటాయించేది. ఇప్పుడిది రాష్ట్రం 40% భరించాలని చెబుతుంది. ఇప్పటికే రాష్ట్రం మూడు లక్షల కోట్లు అప్పులు తెచ్చింది. రాష్ట్రం భరించలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మరి ఆ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ 125 రోజులు పని ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. అందులో 60 రోజులు సెలవులు ప్రకటించారని ఇది భూస్వాములు కొమ్ము కాయడమే అన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. పాత పద్ధతిలోనే చట్టం వ్యవసాయ కూలీల హక్కుగా ఉండాలని కోరారు. పెనగలూరు మండలం, ఎలకచెర్ల , ఉపాధి కూలీలు, మృతి చెందితే, రెండు నెలలైనా, ఈ ప్రభుత్వం, ఒక్క రూపాయి చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద ధర్నా కూడా చేసామని, కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు చేయలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఉపాధి కూలీల పట్ల ఎంత శ్రద్ధ ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మహాత్మా గాంధీ చంపిన వారి పేరు పెట్టడం దేశాన్ని అవమానించడమే అన్నారు. పాత పద్ధతిలో ఈ పథకాన్ని కొనసాగించాలని, అందరికీ జాబ్ కార్డు ఇవ్వాలని, 600 కూలీ, 200 రోజులు పని దినాలు కల్పించాలని, వేసవిలో మజ్జిగ గాని వారాశిష్, గతంలో ఉన్నదాన్ని తొలగించారన్నారు. ఇది చాలా దుర్మార్గం అన్నారు. కూలీల పనిముట్లకు, డబ్బులు ఇవ్వాలని, మస్టర్ స్లిప్పులుఇవ్వాలని, వారం వారం కూలి డబ్బులు చెల్లించాలన్నారు. ఈ చట్టాన్ని మార్చడానికి వ్యతిరేకిస్తూ పోరాటానికి సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు మండల కార్యదర్శి, పి జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు, లింగాల యానదయ్య, సహాయ కార్యదర్శి బండారు రాజశేఖర్. తదితరులు పాల్గొన్నారు.

# అల్మాయిపేట్ గ్రామంలో పల్స్ పోలియో చుక్కలు వేయిస్తున్న గ్రామ సర్పంచ్ దుర్గప్రసాద్



**అందోల్ ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** ఆందోల్ మండలం అల్మాయిపేట్ గ్రామంలో పల్స్ పోలియో చుక్కలు వేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పుట్టిన పాప నుండి ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు మరియు పోలియో చుక్కలు వేయించడానికి వచ్చిన మహిళలు చిన్న పిల్లలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పి.వి. నరసింహారావు 105వ జయంతి



**హైదరాబాద్ ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లోని పి.వి. ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ స్మారక కార్యక్రమంలో పి.వి. కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి పి.వి. గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్ ) చాంబర్స్ కమిటీ చైర్మన్, పి.వి. నరసింహారావు కుమారుడు శ్రీ పి.వి. ప్రభాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై తన తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళు లర్పించారు. అనంతరం డా. జితేందర్ రావు తనుగుల (తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు), ఎం. హరి బాబు తదితరులతో కలిసి మహానేతకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పి.వి. ప్రభాకర్ రావు మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ప్రజల హృదయాల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణ, గౌరవం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. దేశ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారతదేశ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేసిన మహానేతగా పి.వి. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. నిజాయితీ, నిస్వార్థ ప్రజాసేవ, దూరదృష్టి, సమర్థ నాయకత్వం వంటి ఆయన విలువలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, యువత వాటిని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వక్తలు పి.వి. నరసింహారావు దేశ ఆర్థిక, విద్యా, విదేశాంగ, పరిపాలనా రంగాల్లో చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని, దేశాభివృద్ధి పథంలో ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.వి. కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు మహానేతకు మరోసారి ఘనంగా నివాళులర్పించి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సంకల్పించారు.

# జోగిపేటలో పోచమ్మ గుడిలోకి వర్షపు నీరు..

## "మా గుడిని పట్టించుకునే నాథుడే లేడు" అంటూ కాలనీవాసుల ఆవేదన





**అందోల్ ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**అందోల్ మండలంలోని జోగిపేట పట్టణం 14వ వార్డు బాబా నగర్ కాలనీలో ఉన్న పోచమ్మ గుడిలోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడి ప్రాంగణంతో పాటు గర్భగుడిలో కూడా నీరు నిల్వ ఉండటంతో భక్తులు పూజలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాలనీవాసుల మాటల్లో, అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీ నాయకులు గుడిని సందర్శించి, గుడి అభివృద్ధి పనులు చేపడతామని, కొత్తగా నిర్మిస్తామని హామీలు ఇచ్చినా ఇప్పటివరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆరోపించారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతోందని, వెంటనే నీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, పోచమ్మ గుడిని అభివృద్ధి చేయాలని కాలనీవాసులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

# బీఎస్పీ లో చేరిన కాంగ్రెస్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు







**కరీంనగర్ ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనగందుల వెంకన్న ఆధ్వర్యం లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కి చెందిన సీనియర్ నాయకులు గాజుల లింగమూర్తి నేత , ఉడుత రమేష్ నేత , ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు బోగ కనుకయ్య నేత లు ఈ రోజు బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం సమక్షంలో పార్టీ లో చేరగా ఆయన వారికి కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు బహుజనులకు ఎంతో కీలకమైనవి అని అవి భారత రాజ్యాంగం ని కాపాడుకునే ఎన్నికలని అన్నారు. బిజెపి రాజ్యాంగం ను మార్చే కుట్ర చేస్తుందన్నారు. రాజ్యాంగం రద్దు అయితే మనం శాశ్వతం గా బానిసత్వం లోకి పోతామని నిషాని రామచంద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పద్మశాలీలు అందరు బహుజన్ సమాజ్ పార్టీలో భాగస్వాములు కావాలని కోరారు. కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీలు బిసిలను కరివేపాకుల్లాగా వాడుకుంటాయన్నారు. సిరిసిల్ల లో మూడు వందల ఓట్లు లేని దొరలు ఎలా ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారని అన్నారు. బహుజన సమాజం రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని ఓట్లు అమ్ముకోవద్దని సూచించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి గారు సర్వజన హితాయ సర్వజన సుఖాయ నినాదం తో సమాజంలో అన్ని కులాల వారికి జనాభా దమాషా న రాజ్యాధికారం లో వాటాలు ఇచ్చి వారిని అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్నారు అని అన్నారు . బీఎస్పీ ద్వార మాత్రమే బిసి లకు సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు జనాభా పరంగా టికెట్లు ఇవ్వలేదని అన్నారు. బిసిలకు రాజ్యాధికారం కోసమే మాన్యవర్ కాన్షీరాం బీఎస్పీ ని స్థాపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జోన్ ఇంచార్జ్ పల్లే ప్రశాంత్ గౌడ్ , పార్లమెంట్ ఇంచార్జి బోయిని బాబు, జిల్లా ఉపాధ్యక్షులు మంచికట్ల రమేష్ నేత , వెంగల అంజనేయులు నేత అసెంబ్లీ ఇంచార్జ్ గడ్డం మధుసూదన్ , అసెంబ్లీ కార్యదర్శి నక్క విజయ్ , తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ తీట్ల లహరి రాజేష్





**మల్లాపూర్ జూన్ 28 (రిపబ్లిక్ న్యూస్)** రేగుంట గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి కుటుంబం 0--5 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బాస రాజిరెడ్డి, కలసాని రాజన్న MLHP దీప్తి, ANM రాధా, కారోబార్ సుధాకర్, ఆశ వర్కర్ భార్గవి, సంయుక్త, తదితరులు పాల్గొన్నారు.

# అందోల్ మండలం లో బి ఆర్ ఎస్ నాయకుల సమావేశం





**ఆందోల్ ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** అభివృద్ధిని బి ఆర్ ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారు అని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు ఖండిస్తు బి ఆర్ ఎస్ నాయకుల విలేఖరుల సమావేశం ఈ సమావేశం లో మున్సిపల్ కౌన్సిలర్ నాగ రత్నం గౌడ్ మరియు తాలుక లక్ష్మణ్ చాపల వెంకటేశం మాట్లాడుతూ మా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎన్నడూ అడ్డుకోలేదు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న భారీ వాహనాలను జెసిబి లను అడ్డుకుంటే కాంగ్రెస్ పార్టీ వారికీ అభివృద్ధి అడ్డుకున్నట్టు కనపడుతుంది కాంగ్రెస్ నేతలు మీ ఇష్టం వచ్చినట్టు కాబార్దర్ అని బెదిరింపు మాటలు మాట్లాడితే ఇక్కడ ఎవ్వరు భయపడరు మి ప్రభుత్వం అభివృద్ధి పనులు పూర్తి చేసే వరకు ప్రశ్నిస్తూనే వుంటాం గుమ్మడి కాయ దొంగ అంటే భుజాలు తడుము కున్నట్లు కాంగ్రెస్ నాయకుల వ్యవహారం వుంది అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలు అడ్డుకుంటే వీళ్ళు మమ్మల్ని అభివృద్ధి అడ్డుకుంటూన్నాం అనడం విడ్డూరంగా ఉందని అన్నారు మేము ప్రభుత్వానికి మరియు మీ కాంగ్రెస్ నేతలకు సంబందించిన వారి పనుల దగ్గరికీ మీరు చేపట్టే ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలకు ఎన్నడూ అడ్డుపడలేదు అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మట్టి సరఫరాను అడ్డుకుంటే కాంట్రాక్టర్లతో కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కు అయి మా బి ఆర్ ఎస్ పార్టీ మీద బురుద చల్లే ప్రయత్నం చేస్తున్నారు అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలు మరియు రవాణా చేస్తున్న వాహనాలు రెవెన్యూ అధికారులు మరియు పోలీస్ అధికారులకు అప్పగించడం జరిగింది కస్టడీలో ఉన్న వాహనాలను రాత్రికి రాత్రి విడిపించడం విడ్డూరంగా ఉందన్నారు రెవెన్యూ అధికారులు మరియు పోలీస్ అధికారుల మీద కూడ అనుమానం వస్తుంది అక్రమదారులకు వంత ఆడుతున్నట్లు వుంది ప్రభుత్వానికి సంబంధించిన ఏ అభివృద్ధి పనికి అయిన ప్రతి ఒక్క మెటీరియల్ సంబంధించి ప్రభుత్వం ద్వార కాంట్రాక్టరుకు డబ్బులు లభిస్తాయి అనేది యదార్థం అభివృద్ధి పనుల కోసం కావాలసిన మట్టి కొరకు సంబంధిత మైనింగ్ శాఖ ద్వార గానీ రెవెన్యూ శాఖ ద్వారా గాని అనుమతులు తీసుకొని దానికి సంబంధిన డబ్బును ప్రభుత్వానికి చెల్లించాలి కానీ అలా కాకుండా కాంట్రాక్టర్లు కాంగ్రెస్ నాయకుల తో కుమ్మక్కు అయి అక్రమ మట్టి రవాణా చేస్తున్న ట్లు కనిపిస్తుంది ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నట్టు వుంది అక్రమ మట్టి రవాణా దారులను కాంగ్రెస్ నేతలు అడ్డుకొనకుండ అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్న బి ఆర్ ఎస్ పార్టీ వారిపై నిందలు వేయడం ఎంత వరకు సబబు మీ కాంగ్రెస్ నాయకులూ అనుకున్నట్లు ఎక్కడ అక్రమ మట్టి రవాణా జరగకుంటే అందోల్ లో కొన్ని ప్రాంతాల్లో డంపు చేసిన మొరం కుప్పలు ఎవరివి వాటిపైన సంబంధిత అధికారులు విచారణ జరిపి అక్రమ మట్టి నిల్వలు స్వాధీనం చేసుకోవాలి అని డిమాండ్ చేస్తూన్నాం మా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎప్పుడూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిని అడ్డుకొం మీరు చేసే అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని అన్నారు మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ హామలు చేసే వరకు ప్రశ్నిస్తూనే వుంటాం అనీ అన్నారు ఈ సమావేశం లో బి ఆర్ ఎస్ నాయకులు పేండా గోపాల్, పల్లే వెంకట రమణ, రఫిక్, ఇమ్రాన్ ఖాన్, దాసరి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

# పిల్లుట్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 28 ప్రజా రిపబ్లిక్ న్యూస్** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు డాక్టర్ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం, పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లుట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహం సమానత్వానికి ప్రతీక. సామాజిక న్యాయానికి చిహ్నం. ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి. ప్రతి యువకుడికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ గారి జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు. చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే... పుట్టుక మన చేతిలో ఉండదు... కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుందన్నారు. బాబాసాహెబ్ డా. బి ఆర్ అంబేద్కర్ బహుభాషావేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేశారు. అంబేద్కర్ గారు తన కోసం జీవించలేదు. సమాజం కోసం జీవించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారు. గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు" అని ఆయన మనకు నేర్పించారు. మన దేశానికి బీ.ఆర్ అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి... సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించిందన్నారు

అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పి గా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం. మన యువత... బాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. విద్యను ఆయుధంగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జి రాజిరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జోగిపేటలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ప్రజాప్రతినిధులు







**అందోల్ ప్రతినిధి జూన్ 28 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** జోగిపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), కౌన్సిలర్ సైలాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**

**పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి**

**అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**





**అనంతపురం సంక్షేమం, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని కోర్టు రోడ్ లో ఉన్న నెహ్రూ మునిసిపాలిటీ కార్పొరేషన్ స్కూల్ లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

**రెండు చుక్కలు వేయించి అంగవైకల్యం నుంచి రక్షించాలి**

ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల మధ్యనున్న ప్రతి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో చుక్కలు వేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రజలందరూ ఉచితంగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు రెండు చుక్కలు వేయించి అంగవైకల్యం నుంచి రక్షించాలని, వారి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఎన్ని పనులు ఉన్నా ఈరోజు తప్పకుండా పిల్లలకి పల్స్ పోలియో వేయించాలని తెలిపారు.

**పోలియో మహమ్మారి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు**

ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని.. 5ఏళ్ల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. 100 శాతం నిర్మూలనకు మనం దగ్గర్లో ఉన్నామని.. ఇంకా కొంత మంది అవగాహన లేకనో లేదా నిర్లక్ష్యంతోనే ఉంటున్నారన్నారు. అందుకే 5ఏళ్ల లోపు పిల్లలు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో 2,83,430 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశారన్నారు. మొత్తం 1,623 కేంద్రాలతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్లు ఇలా అన్ని చోట్ల పోలియో చుక్కలు వేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంతరావు, యంఎచ్ఓ సునీత, జిల్లా ఇమ్యునైజేషన్ ఇంచార్జ్ అధికారి డాక్టర్ ప్రసన్న భారతి, డెమో నాగరాజు, ఎచ్ఈఓ గంగాధర్, ఏఎస్ఓ ప్రవీణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రెండు చుక్కలు - జీవితాంతం రక్షణ

**జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**







**శ్రీ సత్య సాయి/ పుట్టపర్తి,జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):** రెండు పోలియో చుక్కలు - జీవితాంతం పిల్లలకు రక్షణగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.
ఆదివారం ఉదయం యెనుమలపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కొంతమంది చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.

**ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలియో రహితసమాజ నిర్మాణమే లక్ష్యమని ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పిల్లలకు వేయించే ఈ రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా జీవితాంతం రక్షిస్తాయన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్ర వైద్యారోగ్య శాఖలు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ప్రాణాంతక వ్యాధి నుండి శాశ్వత రక్షణను అందించడానికి ప్రత్యేక పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
పోలియోను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసే విధంగా కార్యక్రమం నిర్వహణకు ముందస్తు చర్యలు తీసుకొని సిబ్బందికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

**వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించవద్దు**

జిల్లావ్యాప్తంగా 1011 పోలింగ్ బూతులలో సుమారు 1,76,283మంది పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.
అన్ని ప్రధాన కూడళ్లు బస్టాండ్లు ,రైల్వేస్టేషన్, స్థానిక ప్రాథమిక కేంద్రాలు అంగన్వాడీలు మరియు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ, పట్టణ శివారు తదితర ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు ఉచితంగా పోలియో టీకాలు వేయడం జరుగుతున్నదన్నారు. దాదాపు 200 దేశాలలో పోలియో పూర్తిగా నిర్మూలించబడిందని అయితే ఒకటి లేదా రెండు దేశాల్లో ఇప్పటికీ ఈ వైరస్ ఉండడం వల్ల ప్రపంచం మొత్తం పోలియో రహితంగా మారే వరకు నిరంతర అప్రమత్తత, టీకాల పంపిణీ అవసరమని అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలు అంగవైక ల్యాలకు గురికాకుండాకాపాడే విధంగా పల్స్ పోలియో బాధ్యతగా కార్యక్రమాలలో పాల్గొని విజయంతం చేయాలని కలెక్టర్ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న వారు విధి నిర్వహణలో భాగంగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడెల్ అధికారి డాక్టర్. మనోజ్ కుమార్ డిఎం&హెచ్ఓ ఫైరోజ బేగం, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ,పుట్టపర్తి తహసీల్దార్
సంహిత,సిహెచ్ఐ వన్నప్ప,పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అనంతపూర్ నైట్ డెమో ఫిలిం విడుదల

**ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సినీ సందడి**

**ఎంపీ అంబికా చేతుల మీదుగా ఆవిష్కరణ**

**చిత్ర బృందానికి ప్రముఖుల అభినందనలు**








**అనంతపురం మల్టీప్లెక్స్, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్):** ప్రతిభను వెండితెరపై ఆవిష్కరించే లక్ష్యంతో రూపొందించిన " ది అనంతపూర్ నైట్ " డెమో ఫిలిం విడుదల కార్యక్రమం ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిగింది. సినీ, సాంస్కృతిక వాతావరణాన్ని తలపించేలా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, సీసీసీ చైర్మన్ కె.యం. షకీల్ షఫీ, డిస్కవరీ అనిల్ ముఖ్య అతిథులుగా హాజరై డెమో ఫిలింను విడుదల చేసి చిత్ర బృందాన్ని అభినందించారు.
ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ స్థానిక యువతలో సినీ రంగంపై ఉన్న ఆసక్తి, సృజనాత్మకత అభినందనీయమని పేర్కొన్నారు. కొత్త కథాంశాలతో, నాణ్యమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించే దిశగా చిత్ర బృందం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతపురం ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి వందలాది మంది ప్రేక్షకులు, సినీ అభిమానులు హాజరై చిత్ర బృందానికి తమ మద్దతు ప్రకటించారు. డెమో ఫిలింకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, అభిమానులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ చిత్ర బృందం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని అన్నారు. జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి పల్స్ పోలియోకార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించా లన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదవ వార్డులో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్ కుమార్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 28( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆందోల్ నియోజకవర్గం లోని జోగిపేట మున్సిపాలిటీలో పదో వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్ కుమార్ పల్స్ పోలియో చుక్కలు పంపిణీ చేశారు వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పుట్టిన పాప నుండి ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మరియు పోలియో చుక్కలు వేయించడానికి వచ్చిన మహిళలు చిన్న పిల్లలు అలాగే కాలనీవాసులు పాల్గొన్నారు

# మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



**బనగానపల్లె జూన్ 28రిపబ్లిక్ న్యూస్** పలుకూరు గ్రామంలో రైతులతో కలిసి 30న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి రైతు తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఇవాళ రాష్ట్రంలో వరి పంట తర్వాత ఎక్కువ సాగు చేసే పంట మొక్కజొన్న మొక్కజొన్న పంటచేతికి వచ్చే సరికి ధర లేక రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు పంట వచ్చే సరికి మద్దతు ధర ఇవ్వాలి బయట మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోయిన మొక్కజొన్న రైతులకు ప్రభుత్వ హామీ ప్రకారం ధరల వ్యత్యాస పథకం కింద ఎకరానికి 21000 చొప్పున చెల్లించాలని కోరారు అదే విధంగా ఉద్యాన పంటలకు మద్దతు ధర ఇవ్వాలి తోతాపూరి మామిడి ట న్నుకు రూ 18000 బంగినపల్లి మామిడి..కి 25000..జీడి మామిడి 80 కేజీల బస్తా 16000 కోకో గింజలు కిలో 1100 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచి సాగునీటి ప్రాజెక్టుల కాలువ నిర్మాణం చేపట్టాలి పంట కాలువలలో ఉన్న పూడిక గుర్రపు డెక్క తోడికాడలను తొలగించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు చేపట్టి చెరువుల ఆక్రమణలు తొలగించి కట్టలను బలోపేతం చేయాలి వ్యవసాయ సంక్షోభం వలన అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఒక్కో కుటుంబానికి 7 లక్షల చొప్పున పరిహారం అందించాలని 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు పదివేలు పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ సమస్యల పైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఈనెల 30 తారీఖున చలో విజయవాడ కార్యక్రమం చేపట్టింది కావున అన్నదాత రైతన్నకు అండగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని ఈ ధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పలుకూరు గ్రామ రైతులకు పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి పలుకూరు సిపిఐ కార్యదర్శి బాలయ్య చిన్న బాలయ్య వెంకటేశ్వర్లు మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# పలు కుటుంబాలకు పల్లె పరామర్శ

**టీవీ9 రిపోర్టర్ తండ్రికి నివాళి**





**శ్రీ సత్య సాయి క్రైమ్, జూన్ 28,(రిపబ్లిక్ న్యూస్)**శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో వరుస విషాద ఘటనలతో బాధలో ఉన్న కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన బోలె బయన్న కుటుంబ సభ్యులను ఆయన వారి నివాసంలో కలిసి ఓదార్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం తన వంతు ఆర్థిక సాయం అందించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నీరు చిన్నికృష్ణ కుమార్తె ప్రియదర్శిని (14) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. చిన్న వయసులో జరిగిన ఈ విషాదం బాధాకరమని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవసరమైన సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. పుట్టపర్తి అర్బన్ టీవీ9 రిపోర్టర్ కేశవ తండ్రి చిన్న నరసింహులు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లారు. పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతంగా నిర్వహించిన అధికారులు,




**రైల్వే కోడూరు జూన్ 28 రిపబ్లిక్ న్యూస్.** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతముగా నిర్వహించినట్లు వైద్య అధికారులు తెలియజేశారు,
ఓబులవారిపల్లె మండలం వై కోట పంచాయతీ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ దేవేందర్ రెడ్డి పల్స్ పోలియో గురించి తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వై కోట పంచాయతీ పరిధిలో 20 పల్స్ పోలియో కేంద్రాలను నిర్వహించమని పిల్లల తల్లిదండ్రులు సుమారు 1830 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించడం జరిగినదని, ఈ పోలియో చుక్కలు ఐదు సంవత్సరముల లోపు పిల్లలకు తప్పనిసరిగా తల్లిదండ్రులు వేయించేలా ప్రచారం నిర్వహించడం జరిగినదని ఆ ప్రకారం తల్లిదండ్రులు వారి యొక్క విద్యుక్త ధర్మాన్ని పిల్లల తల్లిదండ్రులు నిర్వర్తించారని,వైద్యాధికారి, ఎం ఎల్ హెచ్ పి అధికారి మౌనిక వైద్య సిబ్బంది ఐ సి డి ఎస్ కార్యకర్తలు పలు శాఖల అధికారులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వైద్య అధికారులకు సహాయంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సి నాగమ్మ పాల్గొన్నారు, ఈ నేపథ్యంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు గ్రామంలో తిరిగి ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పోలియో చుక్కలు పిల్లలకు వేయించాలని అది వారి భవిష్యత్తు జీవన విధానానికి చాలా అవసరం అని ఆమె పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు, కార్యక్రమంలో వై కోట వైద్యాధికారి పి దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్ హెచ్ పి మౌనిక, ఐసిడిఎస్ సిబ్బంది పలు శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించినట్లు వైద్యాధికారి దేవేందర్ రెడ్డి తెలియజేశారు,

# రెండు చుక్కలు చిన్నారుల బంగారు భవితకు

**0-5 సంవత్సరాలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరి**

**29, 30 తేదీల్లో మాప్-అప్ ద్వారా మిగిలిపోయిన పిల్లలందరికీ పోలియో టీకాలు**

**బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పోలియో కౌంటర్లు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 28 (రిపబ్లిక్ న్యూస్):** రెండు పోలియో చుక్కలు చిన్నారుల బంగారు భవితకు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం మూలసాగరంలోని ఎంఎస్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మెప్మా పిడి వెంకట దాసు, జిల్లా పల్స్ పోలియో నోడల్ ఆఫీసర్ రమేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు శారద బాయ్, లక్ష్మీ ప్రసన్న, డా.ఎన్టీఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం పోలియో రహిత దేశంగా ఉన్నప్పటికీ చుట్టుపక్కల దేశాల్లో అక్కడక్కడ పోలియో కేసులు నమోదవ్వడం వల్ల వాటి నుండి పిల్లలను రక్షించడానికి సంవత్సరానికి రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. అందుకు గాను 0-5 సంవత్సరాలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లాలో 2 లక్షల 38 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందజేసేందుకు గాను 1320 చోట్ల పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రయాణాల్లో ఉన్న చిన్నారుల కోసం బస్ స్టేషన్స్, రైల్వే స్టేషన్స్ దగ్గర కూడా పోలియో చుక్కల కేంద్రాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జ్వరం, జలుబు, విరేచనాలు ఉన్న పిల్లలకు కూడా ఈ టీకాలు వేయించవచ్చని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా, బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత భారత్‌ను కాపాడుకోవడంలో భాగస్వాములు కావాలి అని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో పోలియో కేంద్రాలకు వెళ్లలేని వారి కోసం ఈ నెల 29, 30 తేదీల్లో మాప్-అప్ కార్యక్రమం ద్వారా మిగిలిపోయిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు అందజేయడం జరుగుతోందన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా అంతటా చిన్నారులకు అందజేయడం జరుగుతోందన్నారు.






# బాలుడు అదృశ్యం.. కేసు నమోదు

**బండి ఆత్మకూరు, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం, కాకునూరు గ్రామానికి చెందిన నాగార్జున, చెవిటి ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు నాగ చరన్ అనే తొమ్మిది సంవత్సరాల బాలుడు అదృశ్యమయ్యాడు. ఆదివారం ఉదయం ఇంటి నుండి ఆడుకోవడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇల్లు, బంధువుల ఇల్లు, పొలాలు, వాగుల వెంట గాలింపు చేపట్టారు. అయినప్పటికీ బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో బాలుడు తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. బాలుడి ఆచూకీ ఏమైనా తెలిస్తే 9121101094 సంప్రదించాలని పోలీసులు సూచించారు



అదృశ్యమైన నాగ చరణ్ ఫైల్ ఫోటో

# ఎస్ఐఆర్‌లో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

**ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**బీఎల్‌వోలు ఓటర్ల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలి**

**ఒకే సందర్శనలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఓటరు భాగస్వామి కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్ సమీపంలోని 100, 101, 102 పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కర్నూలు నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసి, అవసరమైన సహాయాన్ని అందించాలని బీఎల్‌వోలను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను దశలవారీగా కాకుండా సాధ్యమైనంత వరకు ఒకే సందర్శనలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలను వెంట తీసుకువస్తే ప్రక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వో, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రథసప్తమి రోజు హామీ..
# కొద్ది రోజుల్లో నెరవేర్చిన ఎమ్మెల్యే

**సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి -రోడ్డు ప్రారంభంతో గ్రామస్తుల హర్షం**

**గ్రామస్తులకు తొలగిన బురద కష్టాలు -ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం**





**బండి ఆత్మకూరు, జూన్ 28, (రిపబ్లిక్ న్యూస్):-** సూర్య భగవానుడి జయంతి గత రథసప్తమి నాడు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పార్నపల్లి గ్రామస్తులకు ఒక హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కొద్ది రోజుల్లోనే రూ 50 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మించి పంచాయతీరాజ్ డీఈ ఆయాజ్ భాష, ఏఈ వెంకట రాముడు స్థానిక టిడిపి నాయకులు మురళీధర్ రెడ్డి, బుల్లెట్ రాఘవరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం సీసీ రోడ్డు ప్రారంభించి గ్రామానికి అంకితం చేశారు. గ్రామ శివారులో వెలసిన సూర్య దేవాలయంలో గత రథసప్తమినాడు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో ఆయన సూర్య దేవాలయం చేరుకునేందుకు గ్రామస్తులు బురద దారిలో పడుతున్న కష్టాలను కల్లారా చూశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు నిర్మించి బురద కష్టాలు తొలగిస్తానని గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కొద్ది రోజుల్లోనే గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి సూర్య దేవాలయం వరకు రోడ్డు నిర్మించి గ్రామస్తుల బురద కష్టాలు తొలగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి సీసీ రోడ్డును ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామానికి చేరుకోగానే తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సూర్య దేవాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. జ్ఞాపిక, స్వామివారి కంకణాలు బహుకరించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ రథసప్తమి నాడు హామీ ఇచ్చారు.. ఆదివారం నెరవేర్చారనీ ఎమ్మెల్యేతో చెబుతూ సంతోషం వ్యక్తం చేశారు. తదనంతరం ఎమ్మెల్యే స్థానిక అంగన్వాడి కేంద్రంలో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

**ఎస్ ఐ ఆర్ పై శ్రేణులకు దిశానిర్దేశం**

ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ పై పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి అందులో చేపట్టాల్సిన అంశాలను వివరించారు.పార్టీ మండల ఇన్చార్జి ముమ్మడి నాగ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2002లో ఓటర్ల జాబితా సవరణ జరిగిందని మళ్లీ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా 2026 లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా జరగడం కోసం పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి ఓటర్ల జాబితాలో తలెత్తిన తప్పొప్పులను పరిశీలించి సరిచూడాలన్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది పార్టీ నాయకులు, బూతు కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 45 పోలింగ్ బూతులు ఉన్నాయని వాటిలో 33 పోలింగ్ బూతు ఇన్చార్జిలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేవలం 12 మంది బూతు ఇన్చార్జీలు మాత్రమే యాక్టివ్గా పని చేస్తున్నారన్నారు. ఇలా నిర్లక్ష్యం చేసే నాయకులు, బూతు ఇన్చార్జీలు చేతకాకపోతే తప్పుకొని వేరే వారికి అప్పజెప్పాలని ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యక్రమాలపై ఎవరు నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఏ ఒక్క ఓటు హక్కు దారుడు తమ ఓటు హక్కును కోల్పోకూడదని ఎమ్మెల్యే సూచించారు. ఇందుకోసం బూతు కన్వీనర్లు పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి బీఎల్ఓ లు పంపిణీ చేసిన ఓటు హక్కు పత్రాలను పరిశీలించి వాటిని తప్పులు లేకుండా సరి చేసి డిజిటలైజేషన్ చేసే బాధ్యత పార్టీ శ్రేణుల పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పరామర్శ
## పార్థివ దేహానికి నివాళులర్పించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే



**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండల ఎంపీపీ తిప్పన్న మామ మద్దిలేటి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి కర్నూలు నగరంలోని జోహారాపురానికి వెళ్లి మద్దిలేటిపార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మద్దిలేటి గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు

# జూన్ 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

**నంద్యాల, జూన్ 28(రిపబ్లిక్ న్యూస్)**



జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో జూన్ 29వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే **meekosam.ap.gov.in** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు.అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# పిల్లల ఆరోగ్యానికి పోలియో చుక్కలు తప్పనిసరి

**ఈరోజు మిస్ అయిన వారికి 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తాం**

**జిల్లాలో 1,630 పోలియో బూత్‌లు, 52 ట్రాన్సిట్ కేంద్రాలు, 33 మొబైల్ బృందాలు**

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 28)** జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపునిచ్చారు.కర్నూలు నగరంలోని ఏ క్యాంప్‌లో ఉన్న ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు" అనే లక్ష్యంతో ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 100 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.జిల్లాలో మొత్తం 1,630 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణంలో ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో 52 ట్రాన్సిట్ కేంద్రాలు, అలాగే 33 మొబైల్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఈరోజు పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య బృందాలు పోలియో చుక్కలు వేస్తాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. భాస్కర్ రాజు, కార్పొరేటర్ పద్మలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com